# జెన్ జీరో ఇంక్



– నిర్మలాదిత్య

## నాంది

*(లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్థిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మధనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత –

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రంపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్దార్థ(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కేరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయిషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్థల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయిషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీకి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే ... )

## 'మనీ ఆన్ ది టేబుల్'

"జెన్ జీరో. హౌ కేన్ ఐ హెల్ప్," కార్ ఫోన్ లో మాట్లాడింది లక్ష్మి.

" ఊప్స్...క్లీనింగ్ సర్వీసెస్ కోసం వెదుకుతున్నాను. రాంగ్ నంబర్ లాగా ఉంది," అవతల పరిచితమైన కంఠం వినపడింది లక్ష్మి కి.

"క్లీనింగ్ సర్వీస్ కూడా మా కంపెనీ చేస్తుంది. ఏదో కాప్ గొంతు లా ఉంది?" గట్టిగా నవ్వేసింది లక్ష్మి.

"అవును లారెన్స్ మాట్లాడుతున్నాను. ఇంకా ఆఫీసు చేర లేదా? కార్ ఫోన్ మీద మాట్లాడుతున్నట్లు ఉంది." లారెన్స్ గొంతు, ఆ నవ్వు పోల్చుకోవడం, ఎంత కప్పి పుచ్చిన, సులువే.

"అవును కారు లోనే ఉన్నాను. మరో పది నిమిషాలలో ఆఫీస్ చేరుతాను. మరీ పొద్దున్నే ఫోన్ చేసావు?", అంది లక్ష్మి.

"నాకో పని తగిలింది. క్లయింట్ విషయాలు బయటకి పొక్క కూడదు. చాలా సెన్సిటివ్ గా చేయాల్సిన కేసు. ఈ పని చేయడానికి మొదట నీ కంపెనీ నే గుర్తుకు వచ్చింది," అన్నాడు లారెన్స్.

"నువ్వు ఎఫ్ బి ఐ కు పని చేస్తున్నావు. నువ్వు నాకు క్లయింట్ పంపడమేమిటి? ప్రభుత్వానికి ఉన్న సదుపాయాలు నా చిన్న కంపెనీకి లేదని నీకు తెలిసే వుండాలి. నాకు ఆశ్చర్యం గా ఉంది," అంది లక్ష్మి.

" ఆశ్చర్యం ఏమీ లేదు. ఈ రోజు మధ్యాహ్నం రెండు గంటలకి ఫ్రీ నే కదా? నేను ఆ క్లయింట్ ను నీ దగ్గర పంపిస్తాను. అతని పేరు చక్. అతడే అన్ని విషయాలు చెప్తాడు," లారెన్స్ ఫోన్ పెట్టేసాడు.

ఆయషా, లక్ష్మి కి ముందే వచ్చి ఆఫీస్ తలుపులు తెరిచి, పని చేస్తున్నది.

ఐటీవలే ఐడెంటిటీ తెఫ్ట్ కు గురి అయ్యిన పెద్ద కంపెనీ నుంచి ఒక ప్రాజెక్ట్ దొరికింది. జరిగిన దొంగతనం గురించి పరిశోధన చేసి రిపోర్ట్ ఇవ్వాలి. అలానే ఫెడరల్ రిజర్వ్ దగ్గరి నుంచి డేటా విశ్లేషణ చేయమని, కొన్ని ప్రోజెక్ట్ లు దొరికాయి. వాటి పైనే లక్ష్మి, ఆయషా పని చేస్తున్నారు.

మధ్యాహ్నం రెండు గంటలకు ఒక యూనిఫాం వేసుకున్న మనిషి లక్ష్మి ఆఫీస్ కు వచ్చాడు.

"లక్ష్మి గారిని కలవాలి," అన్నాడతను. ఆఫీస్ లో ఉన్నది ఇద్దరే. అందులో లక్ష్మి ఎవ్వరన్న సందేహం ఆ మాటలలో, వచ్చినతని ముఖవలికలలో ఉంది.

"నేనే లక్ష్మి. వాట్ కేన్ ఐ డూ?."

"చక్ గారు పంపించారు. నేను డ్రైవర్ ని. మీరు రెడీ అంటే వారి దగ్గరికి తీసుకెళ్తాను," అన్నాడు.

లక్ష్మి కి ఆశ్చర్య మేసింది. చక్ తనను ఆఫీస్ లో కలుస్తాడనుకుంది లక్ష్మి. ఫోన్ తీసి లారెన్స్ కు రింగ్ చేసింది.

"ఏంటి లక్ష్మి మనం పొద్దున్న మాట్లాడిన విషయం గురించేనా. చెప్పు దేనికి చేసావు ఫోన్?"

"ఇదేంటి చక్ కలుస్తాడన్నావు. ఇప్పుడు నా ఎదురుగా ఒక డ్రైవర్ చక్ దగ్గరికి తీసుకెళ్తానని నిలబడి ఉన్నాడు. నాకు తికమకగా ఉంది. ఎవరీ చక్,?" అడిగింది లక్ష్మి.

“నేను ముందే చెప్పాను కదా. ఇది చాలా సెన్సిటివ్ విషయం. చక్ నువ్వు వినే ఉంటావు, చక్ సాండర్స్. మీ రాష్ట్రం సెనేటర్. ఆయన నీ దగ్గరకి రావడం వీలు పడదు. నువ్వే ఆయన దగ్గరికి పోవాలి. ట్రస్ట్ మీ. టేక్ ది రైడ్,” అన్నాడు లారెన్స్.

లక్ష్మి ఫోన్ పెట్టేసి, డ్రైవర్ వైపు తిరిగి,

“ఎంత టైం పడుతుంది, పోయి రావడానికి,” అని అడిగింది.

“దాదాపు రెండు గంటలు,” అన్నాడు డ్రైవర్.

సెనేటర్ లాంటి వాళ్ళు ఉండడానికి సెయింట్ పీటర్స్ బర్గ్ , క్లియర్ వాటర్ లో మంచి ఖరీదైనా బీచ్ రిసార్ట్ హోటళ్ళు ఉన్నాయి. అక్కడికి కారులో వెళ్లి రావడానికి తప్పకుండా రెండు గంటలు పడుతుంది, అనుకుంది లక్ష్మి. ఆఫీస్ ఆయషా కు అప్పగించి, డ్రైవర్ వెంట నడిచింది లక్ష్మి.

డ్రైవర్ దగ్గర్లోనే ఉన్న హై వే I-75 ఎక్కించగానే మరో గంట ఈ కారులోనే అని, ఫోన్ తెరిచి అఫీసు పని మొదలెట్టింది. ఆయషా రాసిన డ్రాఫ్ట్ రిపోర్ట్ చదివి ఫైనల్ చేయాలి. ఒక పదహైదు నిమిషాలకే డ్రైవర్ కార్ స్పీడ్ తగ్గించడంతో, ఫోన్ నుంచి దృష్టి మరల్చి, కిటికీలో చూసింది. డ్రైవర్ ఎగ్జిట్ తీసుకుంటున్నాడు.

“ఎక్కడికి పోతున్నావు? ఇంకో అరగంట పైన ప్రయాణం చేయాలనుకున్నానే,” అంది లక్ష్మి డ్రైవర్ తో.

“అవును మరో అరగంట ప్రయాణం ఉంది. సెనేటర్ గెయిన్స్ విల్ లో యూనివర్సిటీ కమెన్స్ మెంట్ సమావేశానికి వచ్చారు. అక్కడే మిమ్మల్ని కలుస్తారు”

“గేయిన్స్ విల్ కు కారు లో పోవడానికి మూడు గంటలు పడుతుంది. ఎలా రెండు గంటలలో మనం తిరిగి రాగలం?”

“అక్కడికి ప్లేన్ లో పోవడానికి ఏర్పాటు చేశారు,” అంటూ ఎక్జిక్యూటివ్ ఎయిర్పోర్ట్ లోకి డ్రైవ్ చేసి అక్కడ నిలబడి ఉన్న చిన్న ప్లేన్ దగ్గర ఆపాడు.

లక్ష్మి కి కారు డోర్ తీసి,

“మళ్లీ తిరిగి వచ్చిన వెంటనే, నాకు ఫోన్ చేయండి. నేను ఈ దగ్గర్లోనే వేచి ఉంటాను. మిమ్మల్ని పిక్ చేసుకుని, మళ్లీ మీ ఆఫీస్ లో దించేస్తాను,” అన్నాడు డ్రైవర్.

లక్ష్మి ఆశ్చర్యపడింది. తను ఈ ఎయిర్పోర్ట్ రావడం, ఇలాంటి జెట్ ఎక్కడం ఇదే మొదటి సారి. ఎయిర్పోర్ట్ కు కనీసం రెండు గంటలకు ముందు చేరి, సెక్యూరిటీ లైన్ లలో నిలబడి ప్రయాణాలు చేసే రొటీన్ కు అలవాటు పడ్డ లక్ష్మి కి ఈ అనుభవం కొత్త గానే ఉంది.

గెయిన్స్ విల్ చేరిన తరువాత, అక్కడా ఒక డ్రైవర్ లక్ష్మి ని పిక్ అప్ చేసుకుని సెనేటర్ ఉన్న హోటల్ వద్ద దించేసాడు. లక్ష్మి ఫ్రంట్ డెస్క్ దగ్గర కూడా పోకుండా, ద్వారం వద్దే వేచి ఉన్న మరో కుర్రాడు, సెనేటర్ కు ఇంటెర్న్ అయ్యి ఉంటాడు, లక్ష్మిని తీసుకుని, సెనేటర్ ఉన్న ఒక చిన్న కాన్ఫరెన్స్ రూం కు దారి తీసాడు. తలుపు తట్టి, తెరిచి లక్ష్మిని పరిచయం చేసి ఆ ఇంటెర్న్ వెళ్ళిపోయాడు.

"లక్ష్మి కదా పేరు? నీ గురించి చాలా విన్నాను," నవ్వుతూ తన పక్కనున్న కుర్చీ చూపెట్టాడు.

"ఎస్. థాంక్స్. గ్లాడ్ తో మీట్ యు సెనేటర్ సాండర్స్," అంటూ చేయి కలిపింది లక్ష్మి.

"కాల్ మీ చక్. నాకోసం నీవు సమయం కేటాయించిన దానికి నేను థాంక్స్ చెప్పాలి. నీ గురించి లారెన్స్ తెగ పొగిడాడు. లెట్ మీ కట్ ది చేజ్. నీ సహాయం కావాలి."

"చక్, మీరు ఫైనాన్స్ కమిటీ లో మెంబర్ అని తెలుసు. మా కంపెనీ సైబర్ సెక్యూరిటీ, అదీ ఫైనాన్స్ రంగంలో పనిచేస్తుంది. మీకే విధంగా సహాయ పడగలనో చెప్పండి," అంది లక్ష్మి.

"మీ కంపెనీ ఏమి చేస్తుందో నాకు తెలుసు. ఇది నా కూతురు జెన్నిఫర్ గురించి. తను మీ టాంప లోనే యూనివర్సిటీ లో చదువుతున్నది," అన్నాడు సెనేటర్.

"సమస్య ఏమిటీ?"

"రెండు రోజుల క్రితం ఎమర్జెన్సీ హాస్పిటల్ నుంచి ఫోన్ వచ్చింది. అది నా కూతురు జెన్నిఫర్ గురించి. డ్రగ్ ఓవర్డోస్ అయ్యి స్పృహ కోల్పోవడం తో 911 కు ఫోన్ చేసి హాస్పిటల్ లో చేర్పించారు. ఈ విషయం బయట పొక్క నియ్యకుండడానికి కష్ట పడాల్సి వచ్చింది. ఇప్పుడు నేను చేయాలను కున్న పని కూడా రహస్యంగానే ఉంచాలి అనుకుంటున్నప్పుడు లారెన్స్ నీ పేరు చెప్పాడు."

"అమ్మాయి కి బాగా లేదంటున్నారు. సారీ టు హియర్. హాస్పిటల్ లో చేర్పించారు కాబట్టి, వాళ్ళే రీహాబిలిటేషన్ కూడా చెస్తారనుకుంటా. ఇక్కడ నాకు గానీ, నా కంపెనీ కి గానీ ఎలాంటి పాత్ర తోచటం లేదు," అంటూ లక్ష్మి తన మనస్సులోని ఆందోళనను వ్యక్త పరిచింది

"జెన్నిఫర్ మంచి పిల్ల. ఎంతో అమాయకత్వంతో నిండి ఉన్న నా బేబీ నీ ఈ స్థితి కి తెచ్చిన వారి గురించి నాకు రిపోర్ట్ కావాలి. వాళ్ళను అరెస్ట్ చేయించి రైకర్స్ లాంటి కరుడు కట్టిన నేరస్తులుండే జైలు పాలు చేయాలి."

తండ్రిగా సెనేటర్ పడుతున్న బాధ అర్థమైంది లక్ష్మి కి. కానీ ఈ సమస్యను తన కంపెనీ ఎలా పరిష్కరించ గలదు అని అనుమానం వచ్చింది. ఇదేదో పోలీసులకు అప్పగించారు వలసిన విషయం. గుప్తంగా ఉంచాలంటే ప్రైవేట్ ఇన్వెస్టిగేటర్లు ఉన్నారు.

లక్ష్మి సెనేటర్ తో ఆ మాటలు అనడానికి సంకోచించింది. తనను ఈ పరిస్థితి లో ఇరికిచ్చిన లారెన్స్ పై చిరుకోపం వచ్చింది. ముఖ్యమైన నిర్ణయాలు అకస్మాత్తు గా తీసుకో కూడదని అనుభవం మీద నేర్చుకుంది లక్ష్మి.

"జెన్నిఫర్ డీటైల్స్ నాకు పంపించండి. నా కాంటాక్ట్ వివరాలు ఈ కార్డులో ఉన్నాయి. ఇమెయిల్ చేస్తే సరిపోతుంది. నేను మీరు పంపిన వివరాలు చదివి నా నిర్ణయం తెలుపుతాను," అంది లక్ష్మి.

"సమయం తీసుకో. ఈ సమస్య గురించి ఆలోచించు. నిర్ణయం గురించి ఆలోచించనవసరం లేదు. నీ మీద, నీ కంపెనీ మీద మా రీసెర్చ్, చెక్స్ మేము ఇదివరకే చేసాము. ఈ పనికి నువ్వే సరి అన్న నిర్ణయం నేను ఇదివరకే తీసుకున్నాను. దాన్ని మార్చే ప్రసక్తి లేదు. ఈ రోజు నుంచే మా కేసు మీద పని చేయడం ఆరంభించు. ఖర్చు గురించి వెనుకాడ వద్దు. ఎంతైనా భరిస్తాను. నీ బిల్స్ అన్నీ నా ఇంటర్న్ కు పంపించు," అని సెనేటర్ చెప్పి మీటింగ్ ముగించేసాడు.

హోటల్ బయటకి వస్తూనే, డ్రైవర్ మళ్లీ ప్రైవేట్ ఎయిర్పోర్ట్ కు తీసుకెళ్లడానికి వేచి ఉన్నాడు. కారులో కూర్చుని, లక్ష్మి లారెన్స్ కి ఫోన్ చేసింది.

"లేర్రి, ఆర్ యూ ట్రైయింగ్ టు పంక్ మీ అగైన్? ఆ చక్ తన సమస్యను పరిష్కరించ మంటున్నాడు. నేను పని చేసే పనికి దానికి బొత్తిగా సంబంధం లేదు. యూ ఆర్ సెట్టింగ్ మీ టు ఫెయిల్," కొంచెం ఫ్రస్ట్రేషన్ తో నే అంది లక్ష్మి.

"అబ్బే అలా ఎందుకనుకుంటున్నావు. నీవు మాత్రం తక్కువ తిన్న దానివా. నన్ను ఎన్ని సార్లు ఆట పట్టించలేదు. అయినా సెనేటర్ లాంటి వారి తో డీల్ చేసేటప్పుడు, సిల్లీ గా ఎందు కుంటాను. నీవు తప్పకుండానే ఆ సమస్య సాల్వ్ చేయగలవు, " అన్నాడు లారెన్స్.

లక్ష్మి కి ఎదురుగా ఉన్న డ్రైవర్ గుర్తుకు వచ్చాడు. సంభాషణ పొడిగించడం మంచిది కాదనిపించింది.

"సాయంత్రం డిన్నర్ కి మన రెస్టారెంట్ కే వస్తావు కదా, అక్కడ మాట్లాడుదాము," అని ఫోన్ పెట్టేసింది లక్ష్మి.

లక్ష్మి కి రెస్టారెంట్ లో అడుగు పెడుతుంటే నవ్వు వచ్చింది. ఈ రెస్టారెంట్ లోనే మొదట తను, లారెన్స్ కలుసు కున్నది. డేటింగ్ ఆప్ లో ఎవరిని నమ్మాలి, ఎవరిని నమ్మ కూడదో తెలీదు.

తను చేసే పని మనీ లాండరింగ్ కి సంబంధించింది కాబట్టి క్లీనింగ్ సర్వీసెస్ కంపెనీ కి పని చేస్తున్నానని డేటింగ్ ఆప్ లో పెట్టి, తన చదువుల గురించి ఎక్కడ ప్రస్తావన చేయలేదు. తన ప్రొఫైల్ చూసిన వారు తను ఒక క్లీనింగ్ సర్వీస్ కి పని చేసే ఒక జెనేటర్ అని అనుకుంటారని లక్ష్మి ఆలోచన. ఆ విధంగా తనని తనను లాగానే ప్రేమించే వారు దొరుకుతారని ఒక ఆశ.

లక్ష్మికి, తనంటే ఇష్టపడి మ్యాచ్ అయిన వాళ్ళలో లారెన్స్ కనిపించాడు. లక్ష్మి ఐదు అడుగుల 9 ఇంచీల మంచి హైటు తో ఉంటుంది. లారెన్స్ ఇంకా పొడగరి. చూస్తే ఆకర్షించే తీక్షణ మైన చూపులతో, ఇట్టే ఆకర్షించే చిరు నవ్వు తోను, లక్ష్మి కి తెగ నచ్చేసాడు. అంత వరకు బాగానే ఉంది. కానీ పోలీస్ డిపార్ట్మెంట్ లో కాప్ పని చేస్తున్నాడని చదివి, కొంత తడబాటు గానే ఫీల్ అయ్యింది. కానీ ఆ కళ్ళు, లక్ష్మి ని లారెన్స్ తో కలిపించే వదిలింది.

మొదటి సారి లారెన్స్ ను కలిసింది గుర్తుకు వచ్చింది. తను రెస్టారెంట్ అషర్ దగ్గరికి వెళ్ళగానే, ఆ అమ్మాయి గుర్తు పట్టి,

"ఓహ్ మిస్టర్ రైట్ ఈజ్ వెయిటింగ్ ఫర్ యు," అంటూ అప్పటికే వచ్చి, వేచి ఉన్న లారెన్స్ టేబిల్ దగ్గరికి దారి తీసింది.

లారెన్స్ ఫోటోలో కంటే కూడా బాగా ఉన్నట్లు అనిపించాడు. బాగా డ్రెస్సు అయ్యి రావడం, ఒక కారణం కావచ్చు. చూడగానే లేచి హగ్ చేసుకొని చైర్ వెనక్కు లాగి లక్ష్మి కూర్చో డానికి సహాయ పడ్డాడు. లారెన్స్ వేసుకున్న లైట్ ఫ్రాగ్రెన్స్, అతని హగ్ లో ఎక్సర్సైజ్ చేయడం వల్ల వచ్చిన బాడీ టోన్ తో జత కూడిన మృదుత్వం లక్ష్మి కి మరీ నచ్చింది.

ఇద్దరూ రెడ్ వైన్ ఆర్డర్ చేశారు.

"క్లీనింగ్ సర్వీసెస్ నడుపుతున్నారు అన్నావు. ఎలా జరుగుతుంది నీ బిజినెస్? మీ క్లయింట్ లు ఇంటి వార? లేక బిజినెస్ ఆఫీసు లు కూడా క్లీన్ చేస్తారా?" అడిగాడు లారెన్స్.

లక్ష్మికి నవ్వు వచ్చింది. ఆ నవ్వును అణచుకొని, తను క్లీనింగ్ సర్వీస్ అమ్మాయి లాగానే సంభాషణ కొన సాగించింది.

"ఎక్కడ దుమ్ము, ధూళి ఉందో, అక్కడ పని చేయడానికి సిద్ధం. బిజినెస్ బాగానే ఉంది. మినిమం వేజ్ కంటే ఎక్కువే సంపాదించ గలుతున్నాను. మరి నీ సంగతేమిటి. కాప్ అంటే ఏమి పని చేస్తుంటావు?"

"నా జాబ్ గురించి చెప్పుకోవడానికి పెద్ద ఏమి లేదు. ట్రాఫిక్ కాప్ పని నాది. ఎవరైనా స్పీడ్ లిమిట్ దాటితే పట్టుకొని టికెట్లు ఇవ్వడం. అతి కొద్ది మంది, కారు ఆపడానికి లైట్లు, సైరన్ వేస్తే, పారిపోవడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు ఆ కార్లను చేజ్ చేయడం ఒక్ ఎక్సైట్ మెంట్. అంతకు మించి పెద్దగా చెప్పడానికి ఏమి లేదు."

అలా కబుర్లు చెప్పు కుంటూ పోతూ, డెసెర్ట్ తినే సమయానికి ఇద్దరు ఒక్క సారే నవ్వే సింక్ కి వచ్చేశారు. ఆ పాటికి ఇద్దరి మధ్య చిరపరిచితులు లాగా సంభాషణ సులభంగానే దొర్లుతున్నది.

"ఐ కాంట్ కీప్ అప్ విత్ థిస్. నేను ట్రాఫిక్ కాప్ ను కాను," అన్నాడు లారెన్స్.

"తెలుసు. ఎంత వరకు లాగిస్తావ్ అని చూస్తున్న. నీవు లా చదివావు అని నాకు తెలుసు. నేనూ ఒకటి కన్ఫెస్ చేయాలి. నేను ఇంజనీరింగ్ కోర్స్ చేసి, కంప్యూటర్ సెక్యూరిటీ లో డాక్టరేట్ చేసాను. చేసేది క్లీనింగ్ సర్వీస్ లాంటిదే కానీ, ఆర్థిక రంగంలోని నేరాల మీద, మనీ లాండరింగ్ చేసే వాళ్ళను పట్టుకోవడం లోను ఎక్కువగా పని చేస్తాను," అంది లక్ష్మి.

"నాకు తెలుసు. నేను పని చేసేది ఎఫ్ బి ఐ లో అనలిస్ట్ గా. నీ బ్యాక్ గ్రౌండ్ నాకు ఇక్కడకి రాక ముందే తెలుసు."

ఇద్దరూ మరో సారి, పక్కనున్న టేబుల్ లలో తింటున్న అతిథులు ఒక్క సారి ఉల్లికి పడేల, గట్టిగా నవ్వారు.

ఇక అప్పటి నుంచి, వారు తమ రిలేషన్ షిప్ స్టేటస్ ప్రపంచానికి చాటి చెప్పుకోవడానికి పెద్దగా సమయం పట్ట లేదు. ఒక సంవత్సరం నుండి కలుస్తూనే ఉన్నారు.

లక్ష్మి తాము ఎప్పుడూ కూర్చుండె టేబిల్ దగ్గర కూర్చుని, డ్రింక్స్ తనకు, లారెన్స్ కి ఆర్డర్ ఇచ్చింది. డ్రింక్స్ సర్వ్ చేయక ముందే లారెన్స్ డైరెక్ట్ గా టేబిల్ వద్దకు వచ్చి కూల బట్టాడు.

"హి లక్ష్మి. నీ పని ఇవ్వాళ ఎలా గడిచింది. అయినా నువ్వు నా అపార్ట్ మెంట్ కి ఎప్పుడు మరి పోతావు. చక్కగా నేనో కొత్త రిసిపి ట్రై చేస్తుంటే, మనిద్దరం ఇవే కబుర్లు చెప్పుకోవచ్చు. ఈ రెస్టారెంట్, ఈ ఫుడ్ బోర్ కొడుతుంది," అన్నాడు లారెన్స్.

"కార్ పాయింట్ ఏ నుండి బి కి తీసుకెళ్లడానికి ఉపయోగ పడినట్లు, ఈ ఫుడ్ మనం జస్ట్ జీవించి ఉండడానికే. నాకెలాంటి ఫుడ్ అయినా సరే. నీవు నడుములు వంచి కిచెన్ లో పాటు పడనవసరం లేదు. నేను దానికోసం నీ అపార్ట్మెంట్ మారనవసరం కూడా లేదు "

"ఎప్పుడూ మాట మార్చేస్తావు," నిస్పృహ తో అన్నాడు లారెన్స్.

లక్ష్మి కి లారెన్స్ ముఖం చూస్తూనే చివుక్కు మనిపించింది. లారెన్స్ చేతులు టేబుల్ మీద పట్టుకొని

"నాకు మాత్రం నీ దగ్గరికి మారాలని లేదా. నా బిజినెస్ కొంత నిల దొక్కు కోనీ. అన్నట్టు ఈ సెనేటర్ కేసు నాకెందుకు పంపించావు. ఏదో సైకయాట్రిస్ట్ కి, తరువాత ప్రైవేట్ ఇన్వెస్టిగేటర్స్ కి రిఫర్ చేయాల్సిన కేసు అది. నా బిజినెస్ పెంచితే నేను తొందరగా నీ దగ్గరికి రాగలనన్న ఆలోచన బాగుంది కానీ, ఇలాంటి తలా తోకా లేని కేసుల వల్ల నాకేమీ లాభం లేదు," అంది లక్ష్మి.

"ఈ కేసు నువ్వు మాత్రమే సాల్వ్ చేయగలగు తావు. నన్ను నమ్ము లక్ష్మి. సెనేటర్ కు కావల్సింది, తన కూతురు కు డ్రగ్స్ అందిస్తున్న వారు ఎవరు అని?"

"ఎవరో జెన్నిఫర్ కు తెలిసిన వాళ్ళే ఉంటారు"

" అవును. కానీ సెనేటర్ కు కావలసినది ఎవరి పెట్టుబడి ఈ బిజినెస్ ను నడుపుతున్నది అని? ఆ బిజినెస్ మీద దెబ్బ తీస్తే, జెన్నిఫర్ తో బాటు, మిగిలిన స్టూడెంట్స్ ను కూడా రక్షించి నట్లు ఉంటుంది."

"ఇక్కడ నాకు అడ్డిక్షన్ మాత్రమే కనిపిస్తున్నది. మనీ కనపడడం లేదు."

"ఐ కాంట్ ప్రీచ్ టు ఎ కాయిర్. కానీ నువ్వు ఎప్పుడు పరిశోధన చేసి నట్లే ఫాలో ది మనీ.అడ్డిక్షన్ కి డ్రగ్స్ కావాలి. డ్రగ్స్ అంటే డబ్బుతో కూడుకున్న పని నే. ఆ డబ్బు ప్రవాహం జెన్నిఫర్ తన డబ్బు తో కొన్న డ్రగ్స్ నుంచి చివర వరకు, ఎదురీది, ఎవరు ఈ డ్రగ్స్ కొని జెన్నిఫర్ లాంటి వారికి సరఫరా చేస్తున్నారో అని, మొదలుని సాక్ష్యాధారాలతో పట్టుకో గలిగితే, అదే సెనేటర్ వెదుకుతున్న తన ప్రశ్నలకు జవాబులు."

"డ్రగ్స్ వ్యాపారానికి డబ్బు ఎక్కడ నుంచి వస్తున్నది? ఎవరు ఈ డ్రగ్స్ వ్యాపారం నడిపిస్తున్నారు? ఇలాంటివే ఆ సెనేటర్ ప్రశ్నలయితే, అలాంటి విషయాలు నేను పరిశోధించి రిపోర్ట్ ఇవ్వగలను. లెట్ మి వర్క్ ఆన్ థట్," అంది లక్ష్మి .

అటు తరువాత వారి సంభాషణ వేరే విషయాలపై పోయింది. రెస్టారెంట్ లో తిన్న తరువాత ఇద్దరూ లక్ష్మి ఉంటున్న అపార్ట్మెంట్ కు వెళ్లారు. పొద్దునే లారెన్స్ బెడ్ మీద నుంచి లేచి, పని ఉందంటూ, గబ, గబ డ్రెస్ చేసుకొని, తన ఇంటికి వెళ్లిపోయాడు.

లక్ష్మి కి మరుసటి రోజు ఒక తెలియని నంబర్ నుంచి టెక్స్ట్ వచ్చింది. జెన్నిఫర్ వివరాలు ఉన్నాయి. జెన్నిఫర్ ఫోటో కూడా ఉంది. సెనేటర్ తన పర్సనల్ ఫోన్ నుండి పంపించిన టెక్స్ట్. పిల్లల దగ్గరికి వచ్చే సరికి, అన్ని అడ్డుగోడలు పడిపోతాయి. లేకపోతే సెనేటర్ వ్యక్తిగత ఫోన్ నంబర్ లక్ష్మి లాంటి వారికి దొరకడం సాధ్యం కాదు.

పిల్ల అందంగా ఉంది. వయస్సులో ఉన్న పిల్లలు, అబ్బాయిలు, అమ్మాయిలు, అందంగానే ఉంటారు. కానీ జెన్నిఫర్ ది వయ్యస్సుతో సంబంధం లేని అందం. అలాంటి అమ్మాయి, సెనేటర్ కూతురు డ్రగ్ అడిక్ట్ అయ్యి, రీహాబిలిటేషన్ సెంటర్ లో చేరిందంటే నమ్మ బుద్ధి కావటం లేదు. ఆ 911 ఫోన్ చేయకపోతే, డ్రగ్ ఓవర్డోజ్ తో చనిపోయేది జెన్నిఫర్.

ముందు రోజు లారెన్స్ తో మాట్లాడిన 'ఫాలో ది మనీ ట్రైల్' గుర్తుకు వచ్చింది. వెంటనే సెనేటర్ కు థాంక్స్ తెలిపి, కేసు కోసం జెన్నిఫర్ బ్యాంక్, క్రెడిట్ కార్డ్ స్టేట్మెంట్స్, కనీసం గత మూడు నెలలవి పంపమని చెప్పింది. అలానే జెన్నిఫర్ తన లోకేషన్ సెనేటర్ తో కానీ, వాళ్ళావిడతో కానీ షేర్ చేస్తుంటే అది కూడా తెలుప మని టెక్స్ట్ చేసింది.

మరో కొన్ని గంటలకే, సెనేటర్ అకౌంటెంట్ నుంచి, జెన్నిఫర్ కు సంబంధించిన గత పన్నెండు నెలల బ్యాంక్, క్రెడిట్ కార్డ్ స్టేట్మెంట్స్ అందాయి. అలానే జెన్నిఫర్ వాళ్ళ అమ్మతో షేర్ చేసిన లోకేషన్ వివరాలున్న ఆప్, దాని ఆక్సెస్ వివరాలు అందాయి. మొదట మూడు నెలల డేటా తో మొదలెడతాము అనుకున్న లక్ష్మి కి, సంవత్సరం వివరాలు దొరకడం ఆనందం వేసింది.

లక్ష్మి ఆయషా తో కేసు వివరాలు చెప్పి, బ్యాంక్ స్టేట్మెంట్ లు విశ్లేషించమంది. తను కూడా సెనేటర్ పంపిన వివరాలు పరిశీలించ సాగింది.

ఒక గంట తరువాత అయషా, లక్ష్మి దగ్గరకి వచ్చి, "స్టేట్మెంట్ లు చూసాను. మన దగ్గరున్న సాఫ్ట్వేర్ తో ఏవైనా చెప్పుకోదగ్గ ట్రాన్సాక్షన్స్ ఉన్నాయేమో అని కూడా టెస్ట్ చేసాను," అంది.

“గుడ్. ఏమైనా బయట పడ్డాయా?”అడిగింది లక్షి .

“గత ఆరు నెలల లో కొన్ని మార్పులు కనిపించాయి. సాయంత్రం జెన్నిఫర్ డబ్బు బ్యాంక్ అకౌంట్లో నుంచి ఏ.టి.ఎం ద్వారా బయటకు తీయడం తరచూ కనిపించింది. అన్నీ క్యాష్ గానే. అలా డబ్బు తీసుకున్న, కొన్ని నిమిషాలకే, ఒక రెస్టారెంట్ కు వెళ్లి అక్కడ బిల్ క్రెడిట్ కార్డ్ ద్వారా కట్టడం బయట పడింది,” అంది ఆయషా.

లక్షి , “ఇంటరెస్టింగ్! లొకేషన్ డేటా తో కలిపి చూస్తే మరిన్ని విషయాలు బయట పడతాయి అనిపిస్తున్నది. నువ్వు హైలైట్ చేసిన రిజల్ట్స్ పంపించు, మన సాఫ్ట్వేర్ ను బ్యాంక్ లావాదేవీలు, లొకేషన్ రెండు కలిపి విశ్లేషించ మందాం,” అంది లక్షి .

లక్షి పొడవాటి వేళ్ళు కీ బోర్డ్ మీద వేగంగా, అందంగా విన్యాసాలు చేయడం మొదలెట్టాయి. అయషా పంపించిన డేటా, తను అప్పటికే విశ్లేషణ చేసిన లొకేషన్ డేటా తో కలిపి, సాఫ్ట్వేర్ చేసిన లెక్కల రిజల్ట్స్ లక్షి టేబిల్ మీద ఉన్న మూడు మోనిటర్ల పైన ప్రత్యక్ష మయ్యాయి. కొన్ని గ్రాఫిక్స్ తో సహా .

జెన్నిఫర్ సాయంత్రాలలో ఒక ఏ.టి.ఎం ద్వారా డబ్బులు క్యాష్ రూపంలో తీసుకోవడం మొదలెట్టింది. ముందు పదులలో ఉన్న ఈ క్యాష్ అతి త్వరలోనే వందలకు మారింది. లొకేషన్ మ్యాపు, ఆ ఏ.టి.ఎం, రెస్టారంట్ ఉన్న స్థలం హై లైట్ చేసింది. రెండూ డౌన్ టౌన్ లోని ఈబోర్ సిటీ లో ఉన్నాయి.

అలానే జెన్నిఫర్ అప్పుడప్పుడు స్నేహితులకి చేసిన జెల్ పేమెంట్ ల ఆధారంగా, సాఫ్ట్వేర్ ఆ పేమెంట్ లు అందుకున్న వారి పేర్లు, ఫోన్ నంబర్ల, ఇంటర్నెట్ లో దొరుకుతున్న మరిన్ని విషయాలతో కలిపి పూర్తి ప్రొఫైల్ లు క్రియేట్ చేసింది. వాళ్లంతా జెన్నిఫర్ మిత్రులై ఉండాలి. దాదాపు అందరిదీ ఒక్కటే వయస్సు. ఊళ్ళో ఉన్న కాలేజీలలో చదువుతున్న కుర్రకారే.

“ఇంటరెస్టింగ్, ప్రెట్టీ ఇంటరెస్టింగ్. కొంత ముందడుగు వేశాం. ఆయషా, మనకి రెస్టారెంట్ లొకేషన్ తెలుసు, అక్కడికి వచ్చే జనం తెలుసు. నీకు వయస్సు లో వీళ్ళ కంటే మహా అయితే ఐదేళ్ళు కూడా తేడా ఉండదు. నువ్వు ఈ స్టూడెంట్స్ గుంపులో ఉన్న వారితో సులభంగా ఇమిడి పోగలవు. చెక్ ఔట్ థిస్ లొకేషన్. ఈ సాయంత్రం డిన్నర్ నువ్వు ఈ రెస్టారెంట్ లోనే చేయి. ఖర్చు గురించి ఆలోచించ వద్దు. కంపెనీకి బిల్ చేయి. నువ్వు ఆ పరిసరాలలో గమనించిన విషయాలు రేపు పొద్దున మాట్లాడు కుందాం,” అంది లక్షి .

"ఈ పెర్క్ సంగతి నాకు తెలియదు," నవ్వుతూ అంది ఆయషా, "జెన్నిఫర్ వెళ్తున్న కొలంబియా రెస్టారంట్ కు వందేళ్ల పైన చరిత్ర ఉంది. హేప్పెనింగ్ ప్లేస్. థాంక్స్ లక్షి . తప్పక వెళ్లుతాను. పోయే ముందు జెన్నిఫర్, తన కాంటాక్ట్స్ ల సోషల్ మీడియా అకౌంట్లు కూడా వెదికి, దొరికినంత సమాచారం సేకరిస్తాను."

ఆయషా సాయంత్రం ఏడింటికి, టాంపా డౌన్ టౌన్ దగ్గరున్న ఈబోర్ సిటీ చేరింది. ఇక్కడే గతంలో చాలా క్యూబాన్స్ నివసించేవారు. పొగాకు నుంచి క్యూబన్ చుట్టలు, ఇక్కడున్న చాలా ఫ్యాక్టరీ ల లోనే కట్టేవారు. ఇక్కడ కట్టిన క్యూబన్ సిగార్ లకు అమెరికాలో బాగానే డిమాండ్ ఉండేది. ఈ సిగార్ ఫ్యాక్టరీ లలో పని చేసే వారికోసమే దాదాపు వందేళ్ల క్రితం ఈ కొలంబియా రెస్టారెంట్ ఒక క్యూబన్ కుటుంబం మొదలెట్టింది. ఇన్ని రోజులైనా ఆ కుటుంబం వారే ఈ రెస్టారెంట్ ను అవిరామంగ నడుపుతున్నారు. కాదంటే ఆ చిన్న వీధి మీదున్న రెండు పక్కల షాప్ లు కొనేసి, ఒక 1700 మందికి పైగా కస్టమర్లను ఒకే సారి సర్వ్ చేయ గలిగి నంత పెద్ద రెస్టారంట్ గా మలచ గలిగారు. అంత పెద్ద రెస్టారెంట్ అయినా, అక్కడ తినాలంటే రిజర్వేషన్ తప్పని సరి.

కొలంబియా రెస్టారెంట్ పార్కింగ్ లోనే ఖాళీ దొరకడంతో ఆయషా తన కారు అక్కడ పార్క్ చేసింది. పార్కింగ్ చేయడంతో ఒక్క రిలీఫ్. కారులో కూర్చుని ఎదురుగా ఉన్న బ్యాంక్ ఏ.టి.ఎం కు వచ్చే పోయే జనాలను చూడ వచ్చు. అలాగే రోడ్డుకు ఆటు పక్కనున్న కొలంబియా రెస్టారంట్ ద్వారాన్ని కూడా.

ఇది వరకు తాము రీసెర్చ్ చేసినప్పుడు, జెన్నిఫర్ తరచూ ఒక నలుగురు స్నేహితులతో ఉన్న ఫోటోలు తన ఇన్స్ట గ్రామ్ లో పోస్ట్ చేసేది. అందులో ఒకతి జూలీ. ఒక పది నిమిషాలలో బ్యాంక్ ఏ.టి.ఎం దగ్గర జూలీ ప్రత్యక్ష మైంది. అక్కడ తన పని ముగించుకొని, కాలి నడకనే, కొలంబియా రెస్టారంట్ దారి పట్టింది.

ఆయషా కారు దిగి, లాక్ చేసి, గబ గబ రెస్టారెంట్ వైపు అడుగులు వేసింది. మొదట్లో ఆ రెస్టారంట్ కి రిజర్వ్ చేసుకోవాలని అనుకుంది. కానీ జెన్నిఫర్ అక్కడ అరగంట కంటే ఎక్కువ సేపు ఉన్నట్లు కూడా లేదు. కొన్ని సార్లు పట్టు మని పది నిమిషాలు కూడా లేదు. అంతే గాక తను రిజర్వ్ చేసిన టేబిల్ కాక మరో గదిలో జెన్నిఫర్, జూలీ ల వంటి వారు ఉంటే, మొత్తానికే మోసం.

ఆయేషా జూలీ ను అనుసరించింది. బాగా సుపరిచితం అయ్యిన దాని వల్లే, జూలీ ఎదురుగా ఉన్న రెస్టారెంట్ స్టాఫ్ కూడా తప్పుకొని ఎడమ వైపున బార్ వైపు దారి తీసింది. ఆయషా కూడా జూలీ లాగానే తనకు డిన్నర్ రిజర్వేషన్ ఉందా అని ఆడుతున్న రెస్టారెంట్ స్టాఫ్ ను తప్పించుకొని, బార్ లో అడుగు బెట్టింది. బార్ కు పోవడానికి రిజర్వేషన్

అవసరం లేదని ఆయషాకు ఇట్టే అర్థం అయిపోయింది. తను డిన్నర్ కు రిజర్వ్ చేసుకోనిది కూడా మంచిదే అయ్యిందనుకొని సంతోషపడింది.

జూలీ బార్ చుట్టూ చూసింది. ఖాళీ గా ఉన్న బార్ హై చైర్ కోసం వెదుతున్న చూపులు లాగా అనిపించాయి. కానీ తాను వెతుకుతున్నది, బాగా డ్రెస్ చేసుకున్న ఒక యువకుడిని. అతని పక్కన కుర్చీ ఖాళీగా కనిపించి అక్కడికి వెళ్లి కూర్చుంది జూలీ. అబ్బాయి అందంగానే ఉన్నాడు. ప్లే బాయ్ లక్షణాలు కనిపించాయి ఆయషా కు. తనూ వారిద్దరికీ కొంత దూరంగా, తను తల ఎత్తితే, వారు కనపడేటట్లు కూర్చుంది.

ఆయషా ఊహించినట్లు జూలీ, ఆ యువకుడు ఏదో బాయ్ ఫ్రెండ్, గర్ల్ ఫ్రెండ్ లాగా ప్రవర్తించలేదు. జూలీ దగ్గరికి వచ్చిన బార్ టెండర్ కు జూలీ డ్రింక్ ఆర్డర్ చేసింది. తెచ్చిన డ్రింక్ తాగుతూ, జూలీ ఆ యువకుడితో కళ్ళు కలిపింది. తన చేతిలో ఉన్నదేదో అక్కడున్న నాప్కిన్ కింద పెట్టి, ఆ యువకుడి వైపు తోసింది. జూలీ తన డ్రింక్ తొందరగా ఒక గుక్కలో తాగేసి, బార్టెండర్ కు అదివరకు ఇచ్చిన కార్డ్ అకౌంట్ మూయించేసి, రెస్టారెంట్ బయటకు దారి తీసింది. బార్ లో జనాలు ఉండటం వల్ల, బార్టెండర్ ఆయషా దగ్గరకు ఏమి కావాలని అప్పుడే అడగడానికి వచ్చాడు. జూలీ బార్టెండర్ మాటలు పట్టించుకోకుండా, విస, విస లేచి జూలీ కు కొద్ది దూరంలోనే నడవడం మొదలెట్టింది.

జూలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న రోడ్డు దాటి పార్కింగ్ లాట్ కు పోయింది. అక్కడ కార్లు వెదుకుతూ, ఒక కిటికీ తెరిచిన కారు దగ్గర పోయి నిలబడింది. ఆ కారులో ఉన్న వ్యక్తి ఏదో అందించగా, అది తీసుకొని వడి వడిగా, పరుగెట్టినట్లు ఇది వరకు ఎ.టి.ఎం ఎదురుగా రోడ్ సైడ్ న పార్క్ చేసిన తన కారు చేరి, కారు తీసుకొని, అక్కడి నుండి వెళ్ళిపోయింది.

ఆయషా కు జూలీ ఆ రోజు నడిచిన నడక మ్యాప్, జెన్నిఫర్ నడచిన లొకేషన్ మ్యాప్ తో పూర్తిగా మ్యాచ్ అయ్యింది. జూలీ ఆ రోజు చేసిన పనులు, జెన్నిఫర్ కూడా చేసి ఉండాలి. జూలీ అలా ప్రవర్తించడం విచిత్రంగా తోచింది. జూలీ కి తను కలిసిన ఇద్దరితో మాటలు లేవు. ఏదో ఆగాంతకుల తో కలిసినట్లు ఉంది. పార్కింగ్ లాట్ లో తన కారు వెదుకుతున్నట్టు అలా నడిచి, ఇది వరకు జూలీ కలిసిన ఆగంతకుని కారు వెనుక గా వెళ్ళి, ఆ కారు నంబర్ ప్లేట్ తో సహా ఒక ఫోటో తీసింది.

తిరిగి హోటల్ లో బార్ కెళ్ళి, ఒక బీర్ ఆర్డర్ చేసింది ఆయషా. బీర్ త్రాగుతూ, తను కూర్చున్న కుర్చీ లో వెనక్కు తిరిగి ఒక సెల్ఫీ తీసుకుంది. అదేదో కొలంబియా లాంటి రెస్టారెంట్ కు పోయిన జ్ఞప్తిక కోసం తీసుకున్న చర్య లాగా అనిపించింది.

తను బీర్ పూర్తి చేసే లోపే, మరి కొందరు యువతి, యువకులు ఆ ప్లే బాయ్ లాంటి అబ్బాయి దగ్గర వచ్చి కూర్చోవడం, లేచి పోవడం జరిగాయి. ప్రతీ సారి, ఆ అబ్బాయి, పక్కనున్న నాప్కిన్ తీసుకోవడం, ఒక క్షణం తరువాత ఆ నాప్కిన్ మడిచి పడేయడం చూసింది. అతని చూపులు ఎదురుగా పైన ఉన్న టీ వీ పైన, అప్పుడప్పుడు ఎదురుగా టేబిల్ పైన ఉన్న తన మొబైల్ ఫోన్ పైన తప్పితే చుట్టూ పక్కల ఎక్కడా చూడటం లేదు. తరచూ ఫోన్ లో ఏదో టైప్ చేస్తున్నాడు.

మరో గంటలో ఆ ప్లే బాయ్ కూడా రెస్టారెంట్ వదలి పార్కింగ్ లాట్ పోయి తన కారు తీసుకొని నెమ్మదిగానే లాట్ బయట పడ్డాడు. కారు లైసెన్స్ ప్లేట్ చూడలేక పోయింది ఆయషా. కానీ ఆ కార్, మోడల్ వెంటనే గుర్తు పట్టేసింది. ముదురు నారింజ రంగులో ఉన్న అతి ఖరీదైన ఆ కార్ మోడల్స్ అరుదుగానే రోడ్ల మీద కనిపిస్తుంటాయి.

“ఎలా ఉన్నది రెస్టారెంట్. ఎవరైనా తెలిసిన వారు కనబడ్డారా? ఏమైనా క్లూలు దొరికాయా?” అడిగింది లక్ష్మి , మరుసటి రోజు ఆయషా ను చూస్తూనే.

ఆయషా తను చూసిన విషయాలు అన్నీ చెప్పింది.

“ఇదిగో నేను తీసిన ఫోటోలు. పార్కింగ్ లాట్ లో జెన్నిఫర్ స్నేహితురాలు, జూలీ మాట్లాడినతని కారు, దాని లైసెన్స్ ప్లేట్. బార్ లో జూలీ నుంచి డబ్బు తీసుకున్న ప్లే బాయ్ యువకుడు,” అంది ఆయషా.

“గ్రేట్ జాబ్. ఆ ఫోటోలు మన కేస్ లో అప్ లోడ్ చేయి. నేను అక్కడి నుండి తీసుకుంటాను,” అంది లక్ష్మి ఆయషా వైపు మెప్పుకోలుగా చూస్తూ.

“మన కేస్ డెడ్ ఎండ్ కు చేరుకుంది అని, కొంచెం నిస్పృహ గా ఉంది,” అంది ఆయషా.

“ఎందుకలా అంటున్నావు”

“డబ్బు డిజిటల్ రూపంలో ఉన్నంతవరకు, మనం ఆ డబ్బును ఫాలో అవ్వచ్చు. జూలీ తన డ్రగ్స్ కోసం కరెన్సీ ఉపయోగించడం తో మనం ఈ కంప్యూటర్ లతో కుస్తీ పడి సాధించేది ఏమీ లేదు. బాట ఆగిపోయింది. ఎదురుగా ఉన్నది మనం తెలుసుకోలేని అఘాధమే. ది ట్రైల్ హాజ్ గాన్ కోల్డ్.”

“మరీ అంత సులువుగా పరిష్కరించే కేసు అవ్వుతే మన అవసరం ఎందుకు?” ఆంది లక్ష్మి .

“అది నిజమే. ఇప్పుడు మనకున్న మార్గమేమిటి? “(ముగింపు వచ్చే సంచికలో)

Post your comments